క్లుప్తంగా

బెదిరింపులపై కేసు నమోదు

కంకిపాడు: గొల్లగూడెం సర్పంచ్‌ను చంపేస్తామంటూ వచ్చిన బెదిరింపులపై స్థానిక పోలీసుస్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని గొల్లగూడెం గ్రామ సర్పంచ్‌గా నత్తా దుర్గాభవాని వ్యవహరిస్తున్నారు. గ్రామంలో బస్టాండు ఏర్పాటు చేసే విషయమై గ్రామానికి చెందిన దాసరి రాజేష్, అశోక్‌లు సర్పంచ్‌తో గొడవపడి చంపేస్తామని బెదిరించారు. దీనిపై సర్పంచ్ నత్తా దుర్గాభవాని ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: కానూరులో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన మంగళవారం వివరాలు వెల్లడించారు. గ్రామంలో భాగ్యనగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ కారణంగా డీఎస్‌ఆర్ కాలనీ, ఎస్సీ ఏరియా, ఎస్‌బీఐ కాలనీ, రాజ్‌కమల్ భవనం ప్రాంతం, కానూరు ప్రధాన రహదారి, వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. స్థానికులు తమ సిబ్బందితో సహకరించాలని కోరారు.

కారు ధ్వంసం

పెనమలూరు: కారులో ప్రయాణిస్తున్న మహిళపై వ్యాను డ్రైవర్ దాడి చేయటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి వెటర్నరీ ఆస్పత్రి రోడ్డుకు చెందిన తోటకూర పద్మ తన కారులో విజయవాడ నుంచి పోరంకి బయలు దేరింది. ఆమె కారు ఆటోనగర్ గేటు దాటిన తరువాత వెనుక నుంచి వచ్చిన వ్యాన్ కారును వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో పద్మ కారు దిగి కారుకు దెబ్బ తగిలిందేమోనని చూస్తున్న సమయంలో వ్యాన్ డ్రైవర్ వచ్చి ఆమెను దూషించాడు. ఆ తరువాత ఆమె కారుతో పోరంకి వైపునకు వస్తుండగా వ్యాన్ డ్రైవర్ ఆమె వెంట పడ్డాడు. కారు పోరంకి సెంటర్ వద్దకు వచ్చిన సమయంలో వ్యాన్‌ను కారుకు అడ్డంగా ఆపాడు. వ్యాన్ డ్రైవర్ వ్యాన్‌లో ఇనుప రాడ్ తీసుకుని వచ్చి కారు అద్దాలు ధ్వంసం చేసి భయభ్రాంతులకు గురి చేశాడు. ఈ ఘటన పై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా వ్యాన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన దంపతులపై కేసు

పెనమలూరు: పోలీసుల విధులకు ఆటంకం కలిగించి, దూషించిన భార్యాభర్తలపై మంగళవారం కేసు నమోదైంది. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్‌ఐ అర్జున్‌రాజు, హోంగార్డు మధిరి రమేష్‌బాబు సోమవారం రాత్రి యనమలకుదురు, తాడిగడప గ్రామాల్లో రాత్రి రౌండ్స్ ముగించుకుని కామయ్యతోపు వద్దకు వచ్చారు. అక్కడ ఆర్‌కే మిలటరీ భోజన హోటల్ రాత్రి తెరిచి ఉంది. ఎస్‌ఐ అర్జున్‌రాజు సూచనతో హోంగార్డు రమేష్‌బాబు హోటల్ వద్దకు వెళ్లి యజమాని దోనేపూడి రవితేజను సమయం గడిచింది..హోటల్ మూసివేయాలన్నాడు. దీంతో హోటల్ యజమాని రవితేజ ఆగ్రహంతో హోంగార్డు రమేష్‌బాబును బయటకు తోసేశాడు. ఇంతలో అతని భార్య కముద వచ్చి భర్తతో కలిసి ఎస్‌ఐ, హోంగార్డును దూషించింది. ఈ ఘటనపై హోంగార్డు రమేష్‌బాబు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన భార్యాభర్తలపై కేసు నమోదు చేశామని తెలిపారు.

బస్‌పాస్‌ల పంపిణీ

ఉయ్యూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఉన్నతికి తోడ్పాటు అందించాలని కరూర్ వైశ్యా బ్యాంక్ ఉయ్యూరు బ్రాంచ్ మేనేజర్ బ్రిజేష్‌కుమార్ సింగ్ అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో ఉయ్యూరు జెడ్పీ పాఠశాలలో 'విద్యతో ఉజ్వల భవిష్యత్' అనే అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు బస్‌పాసులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ డిస్ట్రిక్ట్ కేబినెట్ ట్రెజరర్ నూకల వెంకట సాంబశివరావు, క్లబ్ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, ఆర్టీసీ డీఎం ప్రసాద్, హెచ్‌ఎం. శ్రీనివాసరావు పాల్గొన్నారు.



జోరు వర్షం..పంటలకు జీవం

- అల్పపీడన ప్రభావంతో మారిన వాతావరణం
- ఉరుములు, మెరుపులతో వర్షం
- రైతుల హర్షం



కంకిపాడులో సాగులో ఉన్న వరి పొలం

కంకిపాడు: అల్పపీడన ప్రభావంతో వాతావరణం ఒక్కసారిగా మారింది. కంకిపాడు పరిసర ప్రాంతాల్లో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. గత నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ఎండ తీవ్రతతో పాటుగా, ఉక్కపోత, వేడిగాలులకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అల్పపీడన ప్రభావంతో మధ్యాహ్నం నుంచి వాతావరణం పూర్తిగా మేఘావృతమై కారుమబ్బులు కమ్మేసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. వర్షం కారణంగా బస్టాండు సెంటరు, రైతు బజారు, కంకిపాడు, పునాదిపాడు అండర్‌పాస్‌ల వద్ద వర్షపునీరు నిలిచిపోయింది. రాకపోకలు సాగించేందుకు వాహనదారులు అవస్థ పడ్డారు. వాతావరణం మార్పు చెంది వర్షం కురటంతో ప్రజలు ఊరట చెందారు.

పంటలకు జీవం..

ఈ వర్షం పంటలకు జీవం పోస్తుందని రైతులు చెబుతున్నారు. కొద్ది రోజులుగా వర్షం కురవకపోవటంతో కేవలం పంట కాలువ నీరు, బోరు నీటి ద్వారా పంట పొలాల యాజమాన్యం చేస్తున్నారు. కురిసిన మోస్తరు వర్షం పొలాలకు అవసరమైన జీవాన్ని అందిస్తుందంటున్నారు. ముఖ్యంగా వరి నాట్లు పూర్తయిన పొలాలు నిలదొక్కుకుని దుబ్బులు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. పసుపు, అరటి, కంద, కూరగాయ పంటలు మొక్క దశలో ఉన్నాయి. వర్షం మొక్కల ఎదుగుదలకు దోహదపడుతుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉయ్యూరు: ఉయ్యూరులో మంగళవారం జోరు వర్షం కురిసింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. జాతీయ రహదారి వెంబడి సర్వీసు రోడ్లలో వర్షపునీరు నిలిచి పోయింది. వర్షం వరి చేలకు మేలు చేసిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వరితో పాటు వాణిజ్య పంటలకూ జోరు వాన ఉపయుక్తంగా మారింది.



ఉయ్యూరు బైపాస్ మార్గంలో కురుస్తున్న వర్షం

కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి



కంటి పరీక్షలు చేస్తున్న రాజేష్‌కుమార్

కంకిపాడు: కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వీవీ రాజేష్‌కుమార్ సూచించారు. మండలంలోని కుందేరు గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. 115 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. రాజేష్‌కుమార్ మాట్లాడుతూ వృద్ధాప్యంలో కంటి సమస్యలు అధికంగా వస్తాయన్నారు. ప్రాథమిక దశలోనే సమస్యను గుర్తించి వైద్యం చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందని, సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

యువగళంలో ఇద్దరు పోలీసులపై దాడి

- పోలీసుల నుంచి వీడియో కెమేరాను లాగేసుకున్న దుండగులు
- కేసు నమోదు

పెనమలూరు: కానూరు సనత్‌నగర్‌లో జరిగిన లోకేష్ యువగళంలో ఇద్దరు పోలీసులపై దాడి జరిగింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలను ఎస్‌ఐ అర్జున్‌రాజు మంగళవారం వెల్లడించారు. లోకేష్ యువగళం పాదయాత్ర ఈ నెల 20 తేదీ రాత్రి మండల పరిధిలో జరిగింది. ఆ సమయంలో విజయవాడ పోలీస్ కమిషనరేట్ కమాండ్ కంట్రోల్‌లో వీడియో గ్రాఫర్‌గా పని చేస్తున్న కానిస్టేబుల్ కె.ప్రసాద్‌బాబు, హోంగార్డు హరీస్ విధుల్లో ఉన్నారు. అయితే పాదయాత్ర సనత్‌నగర్ రాయాలయం వద్దకు రాగా ఏపీ 39 ఎస్‌క్యూ 1449 నంబర్ కలిగిన మహేంద్ర వాహనంలో కొందరు వ్యక్తులు వచ్చారు.

వారు పోలీసుల రూట్‌కు విరుద్ధంగా వాహనాన్ని మరో మార్గంలోకి మళ్లించటంతో అక్కడ ఉన్న పోలీసులు వాహనాన్ని ఆపారు. దీంతో వాగ్వాదం జరగ్గా ఈ ఘటనను కానిస్టేబుల్ ప్రసాద్‌బాబు వీడియో తీయసాగాడు. ఇంతలో పాదయాత్రలో ఉన్న కొందరు వ్యక్తులు వచ్చి వీడియో తీస్తున్న కానిస్టేబుల్, ఆయనకు అసిస్టెంట్‌గా ఉన హోంగార్డు పై దాడి చేశారు. కానిస్టేబుల్ చేతిలో ఉన్న వీడియో కెమేరా దౌర్జన్యంగా తీసుకుని వెళ్లి పోయారు. ఈ ఘటనపై కానిస్టేబుల్ ప్రసాద్ బాబు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

మానవత ట్రస్ట్ సేవలు అభినందనీయం



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

ఉంగుటూరు: పేదలు, వృద్ధులకు మానవత చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని మోదుగు భాను సుందర్ కుమార్ అన్నారు. మానవత వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా తేలప్రోలులో వృద్ధులకు దుప్పట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని అన్నారు. భాను సుందర్ కుమార్ అందజేసిన రూ.5 వేలతో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గంటా కనకారావు తెలిపారు. తియ్యగూర సాంబశివారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పంచకర్ల బాబురావు, మాడుగుల ప్రభాకరరావు, రంగారావు, వింత శ్రీనివాసరెడ్డి, భీమవరపు సాంబిరెడ్డి పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. స్థానిక ఏలూరురోడ్డులోని గణపతి కాంప్లెక్స్‌లో మానవత జిల్లా అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు చేతుల మీదగా 50 మంది పేద వృద్ధులకు మంగళవారం దుప్పట్లు అందించారు. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష,కార్యదర్శులు కూరెళ్ల సుబ్బాచారి, కళ్లేపల్లి నారాయణరావు, సీనియర్ సభ్యులు పొట్లూరి శేషాచలం, జన్యావుల సత్యనారాయణ, నారగాని కొండలరావు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు

కంకిపాడు: దాడి ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన వివరాల మేరకు..గొల్లగూడెం గ్రామానికి చెందిన నత్తా వెంకటేశ్వరరావును అదే గ్రామానికి చెందిన బండి కృష్ణను పాత సినిమాహాలు సెంటరులో శ్రీనివాసరావు అనే వ్యక్తిపై జరిగిన దాడి విషయంలో మాట్లాడదామని పిలిచి కొట్టాడని, నత్తా వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

విజేతలకు అభినందన

పటమట(విజయవాడతూర్పు): నేషనల్ ఆక్వాటిక్ చాంపియన్ షిప్ విజేతలను నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం అభినందించారు. విజయవాడ నగరపాలక సంస్థ సర్ విజ్జి స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు ఒడిశా, భువనేశ్వర్‌లోని బిజు పట్నాయక్ స్విమ్మింగ్ పూల్‌లో ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు జరిగిన 39వ సబ్ జూనియర్, 49వ జూనియర్ నేషనల్ అక్వాటిక్ చాంపియన్ షిప్- 2023లో గెలుపొందారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్, కమిషనర్లను ఎన్టీఆర్ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ సెక్రటరీ ఐ.రమేష్ ఆధ్వర్యంలో మెడల్స్ సాధించిన విద్యార్థులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. ఈవెంట్‌లో రాష్ట్ర ప్రభుత్వం తరపున పాల్గొని మెడల్స్ సాధించటం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

పర్యాటకులను ఆకర్షించేలా స్మృతివనం

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



స్మృతివనం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి పర్యవేక్షణలో ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా అంబేడ్కర్ స్మృతివనం పనులు చేపడుతున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. నగరంలోని స్వరాజ్ మైదానంలో నిర్మాణంలో ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహ స్మృతివనం నిర్మాణ పనులను మంగళవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. స్మృతివనం పనులను సీఎం వైఎస్ జగన్, ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తూ పలు సూచనలు చేస్తున్నారన్నారు. డిజిటల్ మ్యూజియం, మినీ థియేటర్ నిర్మాణపు పనులు దాదాపు పూర్తయ్యాయని ఆయన వివరించారు. లైటింగ్, గ్రానైట్, పాత్ వే, వాటర్ ఫౌంటెన్, వెహికల్ పార్కింగ్, ఎలక్ట్రిసిటీ, ల్యాండ్ స్కేపింగ్, గ్రీనరీ సుందరీకరణ తదితర పనులను మరింత వేగవంతం చేసి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. నిర్మాణ పనులను రానున్న రెండు నెలల్లో పూర్తిచేసి ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ తెలిపారు. ప్రారంభోత్సవ సమయానికి సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు పరిశీలన వారిలో ఏపీఐఐసీ చీఫ్ ఇంజినీర్ నరసింహారావు, జోనల్ మేనేజర్ సీతారాం, డెప్యూటీ జోనల్ మేనేజర్ రహీమ్, కేపీసీ ప్రాజెక్టు డైరెక్టర్ పి.వాసుదేవరావు, ప్రాజెక్ట్ మేనేజర్లు కె.కృష్ణమోహన్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సేవా శిబిరం ఏర్పాట్ల పరిశీలన



న్యాయ సేవా శిబిరం ఏర్పాట్లపై చర్చిస్తున్న న్యాయమూర్తులు, రెవెన్యూ అధికారులు

నందిగామ: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా పరిపాలన యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించనున్న న్యాయ సేవా శిబిర ఏర్పాట్లను మంగళవారం పలువురు న్యాయమూర్తులతో కలసి రెవెన్యూ అధికారులు పరిశీలించారు. నెహ్రూనగర్‌లో గల కమ్మ కల్యాణ మండపంలో ఈనెల 26న ఉదయం 8:30 గంటలకు నూతన తరహా న్యాయ సేవా శిబిరం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి ఏర్పాట్లు తదితర అంశాలపై న్యాయమూర్తులు ఆర్డీవో రవీంద్రరావుతో చర్చించారు. పట్టణంలోని జిల్లా 16వ అదనపు కోర్టు న్యాయమూర్తి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా న్యా య సేవాధికార సంస్థ, పరిపాలన యంత్రాంగం, పోలీస్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నూతన తరహా న్యాయ సేవల శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పలు రకాల స్కీములకు సంబంధించి ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా స్థాయిలో జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని న్యాయమూర్తి శ్రీనివాసరావు సూచించారు. పలు కోర్టుల న్యాయమూ ర్తులు వి.లక్ష్మీ రాజ్యం, షేక్ రియాజ్, తహసీల్దార్‌లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 15 మంది ఎంపిక



ఉద్యోగ అవకాశాలు సాధించిన విద్యార్థులు

ఉయ్యూరు: మినీ జాబ్ మేళాలో 15 మంది విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు సాధించారు. స్థానిక ఏజీ అండ్ఎస్‌జీ సిద్ధార్థ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మినీ జాబ్ మేళా నిర్వహించారు. ముత్తూట్ ఫైనాన్స్, హెటిరో ల్యాబ్స్, యాక్సిస్ బ్యాంక్‌తో పాటు పలు సంస్థలు 79 మంది విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. 15 మంది విద్యార్థులను ఎంపిక చేశారని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. మరో 23 మందిని తదుపరి ఇంటర్వ్యూలకు ఎంపిక చేశారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ.శ్రీరామ్, నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులు మధు, నాగప్రసాద్, చంద్రశేఖర్, తదతరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచి కాటూరి సరళ శ్రీనివాస్

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామానికి చెందిన ప్రత్తిపాటి సతీష్ (28) అనారోగ్యం కారణంగా ఆదివారం మృతి చెందాడు. అతనికి భార్య, కుమార్తె ఉన్నారు. బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను మంగళవారం గ్రామ సర్పంచి కాటూరి సరళ శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి జీటీవీ రమణ అందజేశారు. బీమా సదుపాయం త్వరలోనే అందుతుందని గ్రామ సర్పంచి బాధిత కుటుంబానికి తెలిపారు. అవి కాక గ్రామ సర్పంచి కాటూరి సరళ శ్రీనివాస్ సొంత డబ్బులు మరో రూ.10 వేలను అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కాటూరి శ్రీనివాసరావు, స్థానికులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమం ప్రారంభం

ప్రతి మంగళవారం నిర్వహణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానంలో అన్నదాన కార్యక్రమాన్ని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి మంగళవారం ప్రారంభించారు. ఆలయ సమీపంలోని ధర్మసత్రం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరాన్ని రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. దాతల సహకారంతో ప్రతి మంగళవారం అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, భక్తులకు అన్నదానం నిర్వహించాలని ఆలయ పాలకమండలి ఇటీవల నిర్ణయించటంతో తొలి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ చింతా సంపత్‌కుమార్, రైస్ మిల్లర్ కొనకళ్ల రాజశేఖర్ విరాళంతో సుమారు 700 మందికి అన్నదారం నిర్వహించారు. తొలుత అభయాంజనేయ స్వామికి ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దెందులూరు ఏఎంసీ ఛైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, ఆలయ పాలకమండలి ఛైర్మన్ నెరుసు భూషణం, ఈవో కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

